


# మఱ్ఱిచెట్టు కింద

ఆంగ్లం : ఆర్. కె. నారాయణ్

అనువాదం : చింతపట్ల సుదర్శన్

**మెంపీ అడవుల్లో ఓ మారుమూల విసిరేసినట్టు ఉండే గ్రామం సిరల్. జనాభా మూడు వందలకు మించదు. గ్రామస్తులు తాగడానికి, స్నానాలు చెయ్యడానికి, పశువులను కడగడానికి ఊరునానుకుని ఓ చిన్న చెరువుంది. ఆ చెరువు నీట్లో మలేరియా, టైఫాయిడుల్తో పాటు యింకా ఏమేమి పోషింపబడుతున్నవో ఆపైవాడికే తెలియాలి. ఊరిపక్క నించి వెళ్ళే హైవే ఆ ఊరి జనానికి బహిర్భూమి. ఎగుడుదిగుడు సందులూ, ఒకదానిలో ఒకటి ఇరుక్కుపోయిన ఇళ్ళూ, ఇళ్ళ వెనక నాచు నిండిన మురికిగుంటలు. అయితేనేం ఆ ఊళ్ళో వాళ్ళు తమ పరిసరాలు ఎలా ఉన్నప్పటికి ఎంతో ఆనందంగా గడుపుతూ వుంటమే విశేషం.**

వారి ఈ ఆనందానికి కారణం నంబి. నంబి వయస్సు అరవయ్యో, డెబ్బయ్యో. ఏమో ఎనభై, వందా, వందెనభై కూడా కావచ్చు- ఎవరు చెప్పగలరు. బస్సుస్టాపుకు పది మైళ్ళ దూర్రంలో బయటి ప్రపంచంతో ఏమాత్రం సంబంధం లేకుండా ఉండే గ్రామంలో కాలాన్ని లెక్కకట్టడం అంత తేలికైన విషయమేం కాదు. ఎవరైనా ఆయన్ని వయస్సు ఎంతని అడిగితే ఇదివరకెప్పుడో కరువు వచ్చినప్పుడు, అప్పుడెప్పుడో యుద్ధం జరిగినప్పుడు, ఎక్కడో ఓ బ్రిడ్జి కట్టినప్పుడు తను ఎంత ఎత్తు వుండేవాడో గుర్తు చేసుకుని చెబుతాడు... అంతే.

నంబికి చదవడం అంటే ఏమిటో తెలీదు. రాయడం అసలు రానేరాదు. కానీ కథ చెప్పడం మాత్రం వచ్చు. ఆయన తలనిండా కథలే. నెలకి ఒక్క కథ ఖచ్చితంగా తయారవుతుంది. దాన్ని ఆ ఊరివాళ్ళకి ఆసక్తికరంగా చెప్పడానికి ఓ పది రోజులు పడుతుంది.

**అనువాదకథ**

నంబి నివాసం గ్రామం చివర ఉన్న ఓ గుడి. ఆయన ఆ గుడిలో ఎప్పట్నించి ఉంటున్నాడో చెప్పేవారెవరు? గుడి చిన్నదే! గోడలకి జాజుపట్టీలు. గర్భగుడిలో అమ్మవారి విగ్రహం. గర్భగుడి ముందు స్థలమే నంబి ఇల్లు. నిజానికి ఆ ఊళ్ళో ఏ ఇల్లైనా నంబిదే. ఆయనకి తనదంటూ ఏమీ లేదు. ఉన్నదల్లా గుడి శుభ్రం చెయ్యడానికి ఓ చీపురు, ఓ జత ధోవతులు, కప్పుకోడానికి ఓ పంచే... అంతే.

గుడి ఎదురుగ్గా అన్ని వైపులా కొమ్మలు విస్తరించిన మఱ్ఱిచెట్టు ఉంది. దాని నీడలో నంబికి పగలంతా గడిచిపోతుంది. ఆకలి వేసినప్పుడు ఏ ఇంటికి వెళ్ళాలనిపిస్తే ఆ ఇంట్లోకి సరాసరి వెళ్ళిపోయి ఆ ఇంటివాళ్ళతో కల్సి భోంచెయ్యడమే. ఎప్పుడైనా కొత్త పంచె అవసరం వస్తే ఊళ్ళోవాళ్ళు ఎవరో ఒకరు తెచ్చిస్తారు. ఆయన మాత్రం ఊరొదిలి ఎక్కడికీ పోడు. ఊళ్ళోవాళ్ళకి ఆ చెట్టు ఓ క్లబ్బులాంటిది. రోజంతా ఎవరో ఒకరు రావడం చెట్టుకింద నంబి ఎదురుగ్గా కూచోవడం. ఆయనకి మంచి ఉత్సాహంగా ఉంటే పాత సంగతులూ, సంఘటనలూ జోడించి కబుర్లు చెప్పేవాడు. లేకపోతేమాత్రం 'నా గురించి మీరేమనుకుంటున్నారసలు... పున్నమినాటికి కొత్తకథ సిద్ధం చెయ్యాలా వద్దా! కథ చెప్పలేకపోతే తిట్టుకోవద్దు.

నన్ను ధ్యానం చేసుకోనీండి. ధ్యానంలో ఉంటే తప్ప ఆ అమ్మవారు కథ ఇవ్వదు. ఏమనుకుంటున్నారు? కథలు గాల్లో ఎగిరివస్తాయనుకుంటున్నారా? అంటూ లేచి దూరంగా వెళ్ళిపోయి ఏ చెట్టు కిందో ధ్యానం కొనసాగించేవాడు.

ప్రతి శుక్రవారమూ జనం గుడికి వచ్చేవారు. ఆనాడు నంబి ప్రమిదలు వెలిగించి గుడినిండా పెట్టేవాడు. గుడి వెనక పెరిగే మొక్కలపూలు తెంపి అమ్మవారికి అలంకరించేవాడు. జనం తెచ్చిన పళ్ళూ, పూలూ దేవతకి సమర్పించేవాడు.

నంబి తను కథ చెప్పబోయేనాడు ఉదయమే మఱ్ఱిచెట్టు మొదట్లో ఉన్న ఓ గూటిలో దీపం వెలిగించి పెట్టేవాడు. సాయంత్రం పనులు పూర్తయి ఇళ్ళకు వెళ్ళేవాళ్ళు దీపం చూసి రాత్రికి కథ ఉందనుకునేవాళ్ళు. ఇళ్ళకి వెళ్ళి రాత్రి మఱ్ఱిచెట్టు కింద కథ ఉంది, వినడానికి వెళ్ళాలి అని హడావిడి చేసేవాళ్ళు.

చంద్రుడు కొండ వెనక్కి పాకగానే మగాళ్ళు, ఆడాళ్ళు, పిల్లలూ మఱ్ఱిచెట్టుకిందకి గుంపులు గుంపులుగా వచ్చి చేరేవాళ్ళు. నంబి అమ్మవారి ముందు ధ్యానంలో ఉండేవాడు. ధ్యానం అయిపోయేక గుళ్ళోంచి బయటకు వచ్చేవాడు. నుదుటిమీది విబూది, కుంకుమ బొట్టుతో ముఖం వెలుగుతూ ఉండేది. అలా వచ్చి చెట్టుకింద రాతిచప్టా మీద కూచున్నాక కథ మొదలయ్యేది.

ఏ కథ అయినా ఒక ప్రశ్నతో మొదలుపెట్టేవాడు నంబి. గాలిలో వేలు కదిలిస్తూ, దూరంగా ఎక్కడో చూపిస్తూ 'ఆ వైపు చూడండి. ఒక వెయ్యి ఏళ్ళ కింద అక్కడ ఏం ఉండేదో తెలుసా' అనడిగి, 'ఇప్పటిలాగా అక్కడ చెత్తకుప్పలు ఉండేవికాదు. గాడిదలు దొర్లడానికి బూడిద కుప్పలు వుండేవి కాదు. ఓ మహారాజావారి నగరం ఉండేది అంటూ కథ మొదలుపెట్టేవాడు. ఆ రాజు దశరథ మహారాజు కావచ్చు. విక్రమాదిత్యుడు కావచ్చు, అశోకుడు కావచ్చు. ఆయన తల్లో దూరిన మరో మహారాజెవరైనా కావచ్చు. ఇక రాజధాని విషయానికి వస్తే కపిల కావచ్చు మరో పట్టణం కావచ్చు. అలా మొదలుపెట్టి కథని మూడు గంటలు ఏకబిగిన కొనసాగించేవాడు. ఇటుక మీద ఇటుక పేర్చి రాజావారి కోటని నిర్మించేవాడు. కళ్ళు చెదిరే దర్బారుహాలుని వర్ణించేవాడు. ఆ సభలో వందలాది మంది రాజులు, మంత్రులు, ప్రజలు ఉండేవారు. సంగీత విద్వాంసులు శ్రావ్యంగా పాటలు పాడేవారు. వారు పాడిన పాటల్ని నంబి పాడి వినిపించేవాడు. కోటలో గోడల మీద ఉన్న చిత్రపటాలని, విజయచిహ్నాలని కళ్ళకు కట్టినట్టు వివరించేవాడు.

నంబి తను కథ చెప్పబోయేనాడు ఉదయమే మఱ్ఱిచెట్టు మొదట్లో ఉన్న ఓ గూటిలో దీపం వెలిగించి పెట్టేవాడు. సాయంత్రం పనులు పూర్తయి ఇళ్ళకు వెళ్ళేవాళ్ళు దీపం చూసి రాత్రికి కథ ఉందనుకునేవాళ్ళు. ఇళ్ళకి వెళ్ళి రాత్రి మఱ్ఱిచెట్టు కింద కథ ఉంది, వినడానికి వెళ్ళాలి అని హడావిడి చేసేవాళ్ళు. చంద్రుడు కొండ వెనక్కి పాకగానే మగాళ్ళు, ఆడాళ్ళు, పిల్లలూ మఱ్ఱిచెట్టుకిందకి గుంపులు గుంపులుగా వచ్చి చేరేవాళ్ళు. నంబి అమ్మవారి ముందు ధ్యానంలో ఉండేవాడు.

నంబి కథ పురాణం లాగా సాగేది. మొదటి రోజంతా కథ జరగబోయే స్థల వర్ణన మాత్రమే ఉండేది. పాత్రల సంగతే అంతు పట్టేది కాదు. చంద్రుడు చెట్ల వెనక్కి జారి పోగానే 'ఇవాల్టికి చాలు' అని కథ మధ్యలో ఆపి గుళ్ళోకి వెళ్ళి, జనం పూర్తిగా వెళ్ళిపోక ముందే నిద్రలోకి జారుకునేవాడు.

తర్వాత రెండు మూడు రోజులకి మళ్ళీ మఱ్ఱిచెట్టు కింద గూటిలో దీపం వెలిగేది. అది మళ్ళీ వెన్నెల రోజులు ఉన్నంతకాలం వెలుగుతూ ఉండేది. మఱ్ఱిచెట్టు కింద నంబి సృష్టించిన ప్రపంచంలో రాజులు, కథానాయకులు, ప్రతినాయకులు, మనుషుల రూపంలో దేవుళ్ళు, సన్యాసులు ఎందరెందరో ఉండేవాళ్ళు. ఆయన కథ చెప్పే విధానంలో ఓ ప్రత్యేకత ఉండేది. ఆయన మాటల్లో ఒక చిత్రమైన లయ ఉండేది. గొంతు స్థాయిలో భేదాలు ఉండేవి. వెన్నెల వెలుగులో ఆయన కథని జనం మంత్రముగ్ధులై వినేవాళ్ళు. ఆయన నవ్వితే వాళ్ళూ నవ్వేవాళ్ళు. ఆయన గొంతు దుఃఖంతో పూడుకుపోతే ఏడ్చేవాళ్ళు. కథలోని నాయకుల్ని అభిమానించేవాళ్ళు. దుర్మార్గులను శపించేవాళ్ళు. దుర్మార్గులది పైచేయి అయితే బాధతో విలవిల్లాడేవాళ్ళు... కథ సుఖాంతం కావాలని దేవుళ్ళకి మొక్కుకునేవాళ్ళు.

కథ పూర్తయిన్నాడు అక్కడ మూగిన వాళ్ళంతా గర్భగుడిలోకి వెళ్ళి అమ్మవారి ముందు సాష్టాంగపడేవాళ్ళు. కొండ మీద మళ్ళీ పున్నమిచంద్రుడు తొంగిచూసేనాటికి మరో కొత్త కథతో సిద్ధంగా వుండేవాడు నంబి. ఆయన ఎప్పుడూ చెప్పిన కథని మళ్ళీ చెప్పలేదు. ఒకసారి ఓ కథలో వచ్చిన పాత్ర మళ్ళీ కన్పించేది కాదు. ఊరివాళ్ళు ఆయన్ని మామూలు మనిషి కాదనుకునేవాళ్ళు. ఆయన మాటల్ని సూక్తులుగా వల్లించేవారు. ఇతర విషయాల్లో వాళ్ళ బతుకులు ఎంత హీనంగా, కనాకష్టంగా వున్నా ఈ విషయంలో మాత్రం తాము ఎంతో అదృష్టవంతులమనుకునేవాళ్ళు.



ఇలా ఏళ్ళు గడిచేయి. ఒక పున్నమినాడు మళ్ళీ దీపం వెలిగింది మఱ్ఱిచెట్టుకింద. రాత్రి అవగానే బిలబిలమంటూ వచ్చేశారు జనం. నంబి కథ మొదలయింది. 'విక్రమాదిత్య మహారాజావారి కాలంలో ఆయన మంత్రి...' అని ఆగిపోయాడు నంబి. అదే మాటని మళ్ళీ అన్నాడు, మళ్ళీ మళ్ళీ అన్నాడు. 'నాకేమయిందివ్వాళ' అని లోలోపల గొణుక్కున్నాడు. దిగులు పడ్డాడు. 'ఏమయింది నాకు... ఎందుకు తప్పులు దొర్లుతున్నాయి... కథ అంతా ముందు ఆలోచించి పెట్టుకున్నదే కదా! నాకేమీ అర్థం కావడం లేదు' అనుకున్నాడు. ఆయన బాధని గమనించిన గ్రామస్తులు 'తొందరలేదు.